# మగనితలమీద తెల్లవెంట్రుక కనిపిస్తే

రచయిత :
ఆర్. శ్రీరామమూర్తి, బి. ఏ.

పడుచుతనానికి ముసలితనానికి మధ్యగావుండే వయస్సులో ఒకడు మొదటిపెళ్లానికితోడు పడుచు పెళ్లాన్ని ఓదాన్ని కట్టుకున్నాడనీ; వాళ్లు ఇద్దరూ సగం సగం నెరసిన అతని తలనుపట్టుకుని ముసలిది నల్లవెంట్రుకలు, పడుచుది తెల్లవెంట్రుకలు పీకేశారనీ వినోదంగా మనపెద్దలు ఓకథ చెపుతారు. అయితే ఈ కథలోని ముసలాడిపెళ్లాల్లా అందరి పెళ్లాలూ మగని వెంట్రుకల్ని పీకే పెంకిరకం మనుష్యులే అయివుండరు. ఆడదానిది అపరబుద్ధి అని మగవాళ్లు ఎంత ఈసడించినా ఆడవాళ్లల్లో కూడా మహామంచివాళ్లు లేకపోలేదు. మగనితలమీద తెల్లవెంట్రుక కనిపిస్తే పైకథలోని పడుచుపెళ్లాంలాగు దాన్ని పీకివేయడంకాని, ఆధునికపురుషుని చదువుకున్న భార్యలాగు వెంట్రుకలరంగు పులమడంకాని చేయకుండా మగని తెల్లవెంట్రుకను తన మహిమచేత తిరిగి నల్లవెంట్రుకగా చేసిన మహాపతివ్రత ఒకర్తె వుంది.

రాళ్లను శనగలుగా వేయించిన పతివ్రత-బ్రహ్మవిష్ణుమహేశ్వరులను పిల్లలుగాచేసిన పతివ్రత-సూర్యోదయం కాకుండా చేసిన పతివ్రత పుట్టినభారతదేశంలోనే మగనితలమీద తెల్లవెంట్రుకను నల్లవెంట్రుకగాచేసిన పతివ్రత కూడావుంది. ఇతర పతివ్రతల కథలలాగే ఈ పతివ్రత కథకూడా పురాణాల్లోనే దొరకుతూవుంది. అందరి పతివ్రతల కథలూ ఈ వరకే ప్రచారంలోవున్నాయి. కాని నేను చెప్పబోయే పతివ్రతకథమాత్రం ఇంతవరకు బాగా ప్రచారంలోకిరాలేదు. ఈశ్రీరామమూర్తి వ్రాసే కథ చదివేదేమిటనిగాని, ఈ వెంట్రుకలపతివ్రతవృత్తాంతం తెలుసుకునేదేమిటనిగాని తృణీకరించక దీన్ని శ్రద్ధగా పఠించవలసిందిగా ప్రార్థిస్తూవున్నాను. ముఖ్యంగా నాసోదరీమణులను ఈ విషయాన్ని మిక్కిలి శ్రద్ధతో చదవవలసిందిగా కోరుతూవున్నాను.

పూర్వకాలంలో రాజ్యవర్ధనుడు అనేరాజు వుండేవాడు. అతనికి మానిని అనేమహాయిల్లాలు భార్యగావుండేది. మన కథాకాలంనాటికి అతని పట్టాభిషేకంఅయి ఏడువేల సంవత్సరాలు అయింది. మానినికి తాను రాణిని కదా అనేగర్వం కొంచెంకూడా లేదు. దాసీవాళ్ళకు చెప్పక మగనికిచేసే సపర్యలన్నీ ఆమె స్వయంగా చేసేది. ఇల్లా వుంటూవుండగా ఒకనాడు ఆమె మగనికి తలఅంటుతూవుంది. ఆసమయంలో ఆమెకళ్ళల్లోంచి నీటిబిందువులు జారి రాజు శరీరంమీద పడ్డాయి.

మానిని కాపరానికి వచ్చి వేలకొద్దీ సంవత్సరాలయింది. కాని ఆమె ఇంతవరకు ఒక్కసారికూడా కళ్ళను నీళ్ళుపెట్టుకోలేదు. అట్లాంటి సందర్భంలో ఆవేళ ఆమెకళ్ళవెంట నీళ్లుపుట్టాయి అంటే రాజుకు పైప్రాణాలు పైనే పోయినట్లు అయింది. ఆమె అల్లా కళ్ళను నీళ్లు తెచ్చుకోవడానికి కారణమేమిటని అతను అడిగాడు. ఆమె ఏమీ జవాబుచెప్పలేదు. తరిచితరిచి అడిగాడు. చివరకు ఆమె అతనికి అతని తలమీద ఒక తెల్లవెంట్రుక చూపిస్తూ ఇల్లా చెప్పింది :

'మహారాజా! నీతలమీద ఓ తెల్లవెంట్రుక కనిపించింది. ఇంతకంటె నాకు హెచ్చయిన విషాదహేతువు ఏమివుంది?'

ఇట్లా చెబుతూ ఆమె మరింతగా కళ్ళను నీళ్ళుపెట్టుకుంది. రాజు ఆమెచెప్పింది విన్నాడు. ఆమెను

నిదానించి చూచేడు. చిరునవ్వుమొగంతో 'పుట్టడం, పెరగడం, నశించడం అన్నిప్రాణులకూ ఉన్నధర్మం. నీవు బాగా చదువుకున్నదానివి. నీకు ఈప్రకృతిధర్మం తెలియనివిషయంకాదు. అయినా నీవు అజ్ఞానంలోపడి విచారించడం కూడనిపని. ఇక నాసంగతి. వేదాలు చదివేను. శస్త్రాస్త్రవిద్యలు నేర్చేను. శత్రువులను చెండాడేను. రాజ్యపాలనం సాగిస్తున్నాను. ఎన్నోయజ్ఞాలుచేశాను. నీతో చిరకాలంగా సంసారసుఖం అనుభవిస్తూవున్నాను. సకల పురుషార్థాలు నాకు సంభవించాయి. ఇక ముసలితనానికి భయపడ్డం కేవలం వెర్రితన మనిపించుకుంటుంది. వెంట్రుకలు తెల్ల పడ్డంచేత ముసలితనం పైబడుతోందని తెలుసుకొని మాపెద్దలమాదిరిగా నేనున్నూ రాజ్యాన్ని వదిలేసి తపస్సుచేసుకోడానికి అడివికి పోతాను. తెల్ల వెంట్రుకలు మనకు ఈవిధంగా శుభాన్నే కూర్చేవి అగుచున్నాయి.' అని రాజు ఆమెను ఊరడించడానికి ప్రయత్నించాడు.

రాజు తపస్సుచేసుకోవడానికి అడివికిపోనున్నాడనే సంగతి మంత్రులు, పౌరులు విన్నారు. ఏడు వేల సంవత్సరాలుగ తమ్మి కన్నతండ్రిలాగు పరిపాలిస్తున్న రాజుతోటి వియోగానికి వాళ్లు భయపడ్డారు. వెంటనే వాళ్లు గుంపులుగుంపులుగా వచ్చి రాజు ఎదట నిలబడి ఇట్లా మొరపెట్టుకున్నారు :

'మీరుచెప్పినట్లు మీతలమీద కనిపించిన తెల్ల వెంట్రుక దేవిగారికి అంత విచారంకలిగించవలసింది కానేకాదు. ఆవిచారంఅంతా మాది. మీరు అడివికి వెళ్ళిపోతే మాకు ఇక్కడ సర్వక్రియాహాని అవుతుంది. ఏడువేల సంవత్సరాలు రాజ్యపాలనంచేసి గడించిన సుకృతంఅంతా ఇప్పుడు తుడుచుకుపోతుంది. కాబట్టి మాఅందరిమీదా దయనిలిపి మామూలుగా రాజ్యపాలనం చేస్తూవుండవలసిందిగా ప్రార్థిస్తూ వున్నాము.'

ఆమాటలకు మహారాజు 'ప్రజలారా! ఈ రాజ్యం అంతా ఏడువేలఏళ్ళనుంచి ఏలుతూవున్నాను. భార్యతో సంసారసుఖం అనుభవించేను. సంతానం పొందేను. ఇంక తపోవనానికి పోవడమే కోరతగింది. నాతలమీద కనిపించిన తెల్ల వెంట్రుక యముధర్మరాజుకి ప్రియమైన దూతఅనుకోండి. కాబట్టి నా కొడుక్కి పట్టాభిషేకంచేయడానికి తగిన ముహూర్తం ఏర్పాటుచేయవలసివుంది' అన్నాడు.

ముహూర్తంపెట్టడానికి దైవజ్ఞుల్ని రావించాడు. వాళ్లు రాజుప్రయత్నాన్నివిని నిలువునానీరైపోయారు. వాళ్ళకి ఏమిచెప్పడానికీ తోచిందికాదు. 'మహారాజా! మామనస్సులు శోకవికలాలయి వున్నాయి. లగ్నంకట్టలేము' అన్నారు.

మంత్రులు, ప్రజలు, పురోహితులు, దైవజ్ఞులు అందరూ కలిసి రాజును ప్రార్థించారు అడివికి పోవద్దని. రాజు తనప్రయత్నాన్ని మానినట్లు కనిపించలేదు. అందుచేత వాళ్ళకు ఏమిచేయడానికిన్ని ఆలోచన తట్టిందికాదు.

అప్పుడు మానినీదేవి మనం సూర్యభగవానుణ్ణి ఆరాధించి మనరాజుగారిని అధికాయుష్మంతులుగానూ, యౌవనవంతులుగానూ చేసుకుందాము అని అంది.

ఈపద్ధతి అందరికీ నచ్చింది. ఆరాజ్యంలోని అశేషజనమూ సూర్యోపాసకులయారు. వారి అందరికీ మానినీదేవి వుపదేశికురాలు అయింది. ఇంతమంది అతినిష్ఠతో తన్నుకొలుస్తూవుండగా సూర్యభగవానుడు మిక్కిలి ప్రీతుడై ప్రత్యక్షమయ్యాడు. వరాలు కోరుకోమన్నాడు. తమరాజు ముసలివాడుకాకుండా, అపజయం ఎరక్కుండా పదివేలసంవత్సరాలు బ్రతికి ప్రజాపాలనం చేశేటట్టు కోరారు. అతను వరదానం చేశాడు.

అయితే ఈసంగతివిని రాజు సంతోషించలేదు. మానినీదేవిమాత్రం ఆనందసముద్రంలో మునిగి తేలుతూవుంది. అప్పుడు రాజు రాణీతో 'ఇది ఏంవరం? పదివేలయేళ్లు నేను బ్రతికివుండాలి. ఈలోగా బంధువులందరూ స్వర్గానికి పోతారు. నేను ఏకాకిగా ఇక్కడ వుండిపోతాను. ఇల్లాగు బ్రతకడంకూడా ఒక బ్రతుకేనా?' అన్నాడు.

ఇందులోకూడా కొంత సత్యంవున్నట్లు రాణీకి తోచింది. అప్పుడు ఆమె తపస్సుచేసి సూర్యుణ్ణి మెప్పించి రాజుకూడా ప్రజలకొరకు అదేమాదిరి వరాలు పొందేటట్లు ప్రోత్సహించింది.

ఇదిఅంతా మానినీదేవి మగనితలమీద తెల్లవెంట్రుక చూడ్డంవల్ల సంఘటిల్లింది. ఆరోజుల్లో భార్యల అనురాగమూ, ప్రజల రాజభక్తి, రాజుల రంజకత్వమూ ఆవిధంగావుండేవి.